
యూనివర్సిటీ ప్రాంగణంలో మోహరించిన వందలాది మంది పోలీసులు


పోలీసుల దమన కాండను నిరసిస్తూ నినాదాలు చేస్తున్న విద్యార్థులు

## విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి దారుణం



కవాడిగూడ, మార్చి 31: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జి దారుణమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. దివంగత ప్రధాని ఇందిరా గాధీ చొరవతో హెచ్‌సీయూకు కేటాయించిన 2300 ఎకరాల భూమి నుంచి 400 ఎకరాలను తిరిగి వేలం వేయటం సరికాదు. యూనివర్సిటీ భవిష్యత్ అవసరాలకు వినియోగించుకోవడానికి, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన భూమిని టీజీఐఐసీ ద్వారా అప్పగించే ప్రయత్నాన్ని మేధావులు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం సంయమనం పాటించి విద్యార్థులతో చర్చలు జరపాలి. ఆ భూమి వర్సిటీదా కాదా సర్వే ద్వారా తేల్చిన తర్వాతే నిజాన్ని నిర్ధారించి చర్యలు తీసుకోవాలి.

– చావ రవి, రాష్ట్ర అధ్యక్షుడు, టీఎస్‌యూటీఎఫ్

## నమ్మితే అమ్మే నైజం రేవంత్‌రెడ్డిది..



రేవంత్‌రెడ్డిని నమ్మి అధికారం అప్పజెబితే ప్రభుత్వ భూములను అమ్ముతున్నాడు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు ఉద్యమిస్తుంటే పోలీసులు లాఠీచార్జ్ చేయడం దుర్మార్గం. విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు ప్రగతికి నిలయాలు. విద్యాలయాల సంస్థల భూములను అమ్ముకోవడం అంటే విద్యా వ్యవస్థను నాశనం చేయడం అవుతుంది. యూనివర్సిటీల భూములను అమ్ముకునే హక్కు ఎవరికీ లేదు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని అమ్మడానికి ప్రయత్నించడం దారుణం. సీఎం రేవంత్‌రెడ్డి ఇలానే చేస్తే ఐదేండ్లు అధికారంలో ఉండటం కష్టమే.

– భూపతి వెంకటేశ్వర్లు, టీపీఎస్ కే రాష్ట్ర అధ్యక్షుడు

### జలవనరులు, జీవరాశులకు

# ఆవాసం

**తప్పుదోవ పట్టించేలా ప్రభుత్వం ప్రకటన**

**వన్యప్రాణులు, చెరువులు, కుంటలను పరిరక్షించాల్సిందే**

**భూముల వేలం కోసం సహజవనరులన్నీ సర్వనాశనం**

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): చుట్టూ పచ్చని వాతావరణం. ఓవైపు అందంగా పొదిగినట్లుండే మష్రూమ్ రాక్స్, మరోవైపులా వన్యప్రాణులు. వీటి జీవనానికి అవసరమైన మొక్కలు, పొదలు, అంతకు మించి జలవనరులు ఇదీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ, జీవవైవిధ్య స్వరూపం. కానీ ఆ భూములపై కన్నేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సహజ వనరులను ప్రశ్నార్థకంగా చేసేలా వ్యవహరిస్తోంది. ఆ 400 ఎకరాలు వర్సిటీ భూములు కాదని చెబుతున్న ప్రభుత్వం.. ఈ విషయాన్ని కప్పి పుచ్చుకునేలా తప్పుడు ప్రకటనలు కూడా చేస్తోంది. ప్రస్తుతం టీజీఐఐసీ వర్గాలు చేపట్టిన పనులకు సమీపంలో కుంటలు, చెరువులు లేవని, జీవరాశులకు ఎలాంటి హాని లేదని వాదిస్తున్నాయి. కానీ అర్ధరాత్రి బుల్డోజర్ల శబ్దానికి ఎన్నో వన్యప్రాణులు ప్రాణాలతో బయటపడేందుకు పరుగులు పెడుతున్నాయి. తమ గూడు చెరిగిపోతోందని జీవరాశుల అర్థనాదాలు ఓ వైపు. ప్రాజెక్టుకు సమీపంలోనే వేలాది వన్యప్రాణులకు నీటిని అందించే బర్ల కుంట, నెమలికుంట, ఇలా వర్సిటీ సమీపంలో 6 చెరువులు, కుంటలు ఉన్నాయి. కానీ ప్రభుత్వం మాత్రం అవేవి లేవని అబద్ధమాడుతోంది. 100కిపైగా జేసీబీలతో జరుగుతున్న విధ్వంసంతో వన్యప్రాణులు పరుగులు పెడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓవైపు వెస్ట్ సిటీ మొత్తానికి ఆక్సిజన్ అందించే లంగ్ స్పేస్‌ను చెరబట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

#### వర్సిటీలో అన్ని కుంటలే..

2500 ఎకరాల విస్తీర్ణంలో ఉండే వర్సిటీ భూముల్లో 6కు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో ప్రధానమైన వాటిలో బర్ల కుంట, నెమలి, లవర్స్ లేక్‌తోపాటు మరికొన్ని ఉన్నాయి. ప్రస్తుతం పనులు చేపట్టిన ప్రాంతానికి సమీపంలోనే బర్లకుంట పశుపక్ష్యాదులన్నింటికీ జలజీవం. అయితే ఇప్పటికే జంతువులు మృత్యువాత పడినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన డ్రోన్ ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. పనులకు సమీపంలోనే బర్ల కుంట ఉందని గూగుల్ మ్యాపింగ్‌లోనూ తెలిసిపోతుంది. కానీ ప్రభుత్వం వితండ వాదనతో తప్పుదోవ పట్టిస్తోంది.

#### వన్యప్రాణులకు ప్రాణసంకటం

వందలాది జింకలు, నెమళ్లు, కుందేళ్లు, ఇతర వన్యప్రాణులకు ఆవాసమైన ఈ భూముల్లో నిత్యం సంచరిస్తూనే ఉంటాయి. చిరుజల్లుల మొదలైనప్పుడు, వేసవి తాపాన్ని తట్టుకునేందుకు క్యాంపస్ ప్రాంగణంలో తిరుగుతుంటాయని విద్యార్థులు పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం టీజీఐఐసీ భూములకు సమీపంలో ఎక్కడా కూడా వన్యప్రాణుల సంచారం లేదని వాదిస్తోంది. ఆదివారం రాత్రి చేపట్టిన లెవలింగ్ పనులతో ఇబ్బందికి గురైన వన్యప్రాణుల హాహాకారాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. దూసుకువస్తున్న బుల్డోజర్లతో తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందనీ మూగజీవాలు గజగజ వణుకుతున్నాయి. ప్రభుత్వం మాత్రం ఆ భూములను లాక్కునేందుకు ఉన్నది లేనట్లుగా.. లేనిది ఉన్నట్టుగా ప్రకటనలు చేసి వన్యప్రాణులను అరిగోస పెడుతోందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


యూనివర్సిటీ వైవిధ్యాన్ని వర్ణిస్తూ చిత్రాలు వేస్తున్న విద్యార్థులు

# వైవిధ్యనేలపై ఇనుపబూట్ల చప్పుళ్లు



(మొదటిపేజీ తరువాయి)

ఆ భూములు చెందాలంటూ పోరాటం చేస్తున్న విద్యార్థులపై ప్రభుత్వ దమనకాండను పౌరసమాజం ముక్తకంఠంతో ఖండిస్తున్నది. సినీ రాజకీయ ప్రముఖ మేధావులు, పర్యావరణ నిపుణులు, మాజీ ప్రొఫెసర్లు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ చర్యలను ఖండిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియంతలా వ్యవహరించొద్దని, నిరసన తెలిపే హక్కును హరిస్తుందని పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేయడం సమంజసం కాదన్నారు. విశ్వ విద్యాలయాల భూమిని వేలం వేయకుండా అపాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూములను వేలం వేస్తూ కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పర్యావరణాన్ని దెబ్బతీస్తూ.. జీవవైవిధ్యానికి నష్టం కలిగించే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు.

## అభిప్రాయ సేకరణ తప్పనిసరి: వేదకుమార్ మణికొండ



ప్రభుత్వ భూముల వేలం, అమ్మకాలతో ప్రభుత్వాన్ని నడపడం, నగరం అభివృద్ధి చేస్తామని చెప్పడం సరైన పద్ధతి కాదని మాస్టర్ ఆఫ్ అర్బన్ అండ్ రీజినల్ ప్లానింగ్ ఇంజినీర్ వేదకుమార్ మణికొండ అన్నారు. వర్సిటీకి భూములు, పభుత్వ భూములైనా వేలం సమయంలో ప్రజాభ్రిపాయం, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. తాము అధికారంలో ఉన్నామని ఏది చేసినా చెల్లుతుందనే భావన సరికాదు. వర్సిటీ వీసీ, స్టాఫ్, విద్యార్థుల అభ్రిపాయ సేకరణ చేయాల్సిన అవసరం ఉంది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై చర్యలు సరైన విధానం కాదు. పభుత్వ ఆధీనంలో ఉన్న భూములను ఇతర అవసరాలకు వినియోగించకుండా ప్రజల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు వినియోగిస్తే హైదరాబాద్ సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది.


హెచ్‌సీయూ భూములను చదును చేస్తున్న బుల్డోజర్లు


ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ శవయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

## హెచ్‌సీయూ భూములను రక్షించాలి

**రాజ్‌భవన్ ఎదుట ఏబీవీపీ ధర్నా..**

ఖైరతాబాద్, మార్చి 31: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం ఏబీవీపీ కార్యకర్తలు రాజ్ భవన్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు చేతబూనిన విద్యార్థులు ఇది ఇందిరమ్మ రాజ్యమా.. కబ్జాదారుల రాజ్యమా అని నినదించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పృథ్వీ మాట్లాడుతూ 400 ఎకరాల హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం ఆక్రమించాలని చూస్తున్నదని ఆరోపించారు. ఈ విషయంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ విద్యార్థులపై పోలీసుల దాడి, యూనివర్సిటీలోకి జేసీబీలు ప్రవేశించి భయాందోళన సృష్టించడం అమానుషమన్నారు. యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, 400 ఎకరాల భూ అక్రమాలపై విచారణకు ఆదేశించాలని గవర్నర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి అలివేలి రాజు, సభ్యులు మహేష్, బాలు, శ్వేత, విక్రమ్ ఆదిత్య, నందు, రాకేష్, ఆకాష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


రాజ్‌భవన్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

## శ్రీవిశ్వావసు నామ ఉగాది పురస్కారాలు అందజేత

రవీంద్రభారతి : కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్, కిన్నెర కల్చరల్ ,ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ శ్రీతేతలి దశరథ రామారెడ్డితోపాటు పలువురు ప్రముఖులకు కిన్నెర శ్రీవిశ్వావసు నామ ఉగాది పురస్కారాలు అందజేశారు. వక్తలుగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం(ఐఏఎస్.రి), భోగరాజు మూర్తి విచ్చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ.. తెలుగు ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకునే పండగ ఉగాది పర్వదినమన్నారు. కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ వారు ఉగాది పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ వ్యవస్థాపక కార్యదర్శి ముద్దాళి రఘురాం పాల్గొన్నారు.



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథరామా రెడ్డి

# మాకు రైతు భరోసా ఇవ్వరా?

**ఔటర్ రింగు రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల రైతుల ఆవేదన**

**మేడ్చల్ -మల్కాజిగిరిలో ఇప్పటి వరకు రైతు భరోసా ఇచ్చింది రూ. 6 కోట్లే**

**గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు రూ. 33 కోట్లు**

మేడ్చల్, మార్చి31(నమస్తే తెలంగాణ): మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల రైతులకు ఇప్పటి వరకు రైతు భరోసా అందలేదు. వ్యవసాయం సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా వర్తింపజేస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాలలో రైతులు లేరా తమకు ఎందుకు రైతు భరోసా ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. రైతు భరోసా పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.6 కోట్లు మాత్రమే రైతు భరోసా ద్వారానే రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతు బంధును రూ. 33 కోట్లు జమ చేశారని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. రైతులకు ఇచ్చిన ఏ కొక హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని రైతుల బతుకులను ఆగం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### రైతు భరోసా ఇచ్చిందేకు గుర్తించిందే తక్కువ ఎకరాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో రైతు భరోసా ఇచ్చేందుకు గుర్తించింది 14,300 ఎకరాలకే ఇందులో అందరికి రైతు భరోసా అందలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. యాసంగిలో ఎకంగా 64, 700 ఎకరాలకు రైతు భరోసాను అధికారులు కట్ చేశారు.

### రైతులందరికి రైతు భరోసాను అందించాలి



యాసంగిలో వ్యవసాయం సాగు చేసిన రైతులందరికీ రైతు భరోసాను అందించాలి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఔటర్ రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న గ్రామాల రైతులకు ఏ ఒక్కరికి కూడ రైతు భరోసా అందలేదు. ఔటర్ రింగురోడ్డుకు అనుకుని గ్రామాలలో వ్యవసాయం సాగు చేసేవారు రైతులు కాదా. కష్టపడి వ్యవసాయం సాగు చేసే రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు.

– మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి

### ఎర్లీబర్డ్ ఆఫర్‌ను ప్రకటించిన జీహెచ్‌ఎంసీ

**ఈ నెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రిబెట్**

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): నగర వాసులకు జీహెచ్‌ఎంసీ ఎర్లీబర్డ్ స్కీంను అందుబాటులోకి తీసుకువచ్చింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీని ప్రకటించింది. ఈ ఎర్లీబర్డ్ స్కీం ఆఫర్‌ను ఇండ్లు, వ్యాపార సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించిన వారికే ఈ 5 శాతం రిబెట్ ఉంటుందని జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రకటించారు.

# వెల్‌నెస్ సెంటర్ల మాయాజాలం

- ఖరీదైన మందులు తెప్పించి బయట విక్రయిస్తున్నట్లు ఆరోపణలు
- విధులకురాని ఉద్యోగుల వేతనాలు ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఖాతాలో!
- గతేడాదిలో రూ.19.19 కోట్లు ఖర్చు చూపిన వైనం

సిటీబ్యూరో, మార్చి31 (నమస్తే తెలంగాణ):రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు , జర్నలిస్టులకోసం నగదు రహిత ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్లు అక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. పలువురు ఉద్యోగులు వైద్యాన్ని వ్యాపారం చేస్తూ విచ్చలవిడిగా డబ్బులు దండుకుంటున్నారు. వైద్యం కోసం వచ్చినవారికి ఉచిత మందులు అందించేందుకు కోట్లు వెచ్చించి ఫార్మా కంపెనీల వద్ద కొనుగోలు చేస్తున్న మందులు పక్కదారి పడుతున్నాయి. అంతేగాకుండా ఆధారాలు లేకుండా ఉద్యోగం ముసుగులో మటుమాయం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఉద్యోగానికి సెలవు పెట్టిన వారి వేతనాలు సైతం ప్రతినెలా తన ఖాతాలోకి మలుపుకుంటున్న పొరుగుసేవల ఏజెన్సీ నిర్వాకం చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే.

#### ఉద్యోగం ముసుగులో మటుమాయం..

రాష్ట్ర వ్యాప్తంగా 12 వెల్‌నెస్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో సుమారు 253 మంది సిబ్బంది పొరుగుసేవల ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వైద్యులు, ల్యాబ్ టెక్నిషియన్లు, ఫార్మసిస్టులు, నర్సులు మొదలైన సిబ్బందంతా ఔట్‌సోర్సింగ్ విధానంలో వైద్య సేవలందిస్తున్న వారే కావడం గమనార్హం. ఇన్ని విభాగాల్లో వైద్య సేవలందించేందుకు ఒక్క రెగ్యులర్ వైద్యుడు లేడు. వీటికి తోడు పలు సెంటర్లలో ఓపీలు తక్కువ ఉన్నారన్న సాకుతో హాజరు వేసుకొని ఇంటికి వెళ్లిపోయే వారు కూడా ఉన్నారు. పలువురు పొరుగుసేవల సిబ్బంది గతంలో వివిధ సంస్థల్లో విలేకరులుగా చేసినవారు ఉన్నారు. వారంతా జర్నలిస్టులుగా ఆయా కేంద్రల్లో వైద్యం చేయించుకునేందుకు అర్హులే. అయితే జర్నలిస్టు కార్డులు చూపి కావాల్సిన మందులు ఉచితంగా తీసుకొని బయట ప్రైవేట్ వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నయి. సిబ్బంది సహకారంతో ఫార్మసీ ప్రతినిధితులతో తమకు కావాల్సిన మందులు ఇండెంట్ పెట్టి తెప్పించుకోవడం, వాటిని బయట విక్రయించడం పనిగా పెట్టుకున్నారు. ఈ తరహా దారుణాలు జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కావాలనే అలాంటి సిబ్బందిని వెనకేసుకొస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. 2023–24 ఏడాదిలోనే వెల్‌నెస్ సెంటర్లకు మందులు కొనేందుకు రూ.19.19 కోట్లు ఖర్చు అయినట్లు లెక్కలు చూపించడం గమనర్హం.

#### విధులకు రాకున్నా వేతనాలా?

రాష్ట్ర వ్యాప్తంగా వెల్‌నెస్ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాల వల్ల విధులకు రాకుండా నెలల తరబడి సెలవులో ఉన్నవారి వేతనాలు వారి ఖాతాల్లోకి జమచేస్తూ.. తిరిగి పొరుగుసేవల ఏజెన్సీ ఆ సొమ్మును తన ఖాతాలోకి మల్లించుకొంటున్నారు. దీంతో ప్రభుత్వ సొమ్ముకు గండి పడుతోంది. ఈ తరహా మోసాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇదిలా ఉండగా రోగులపై సిబ్బంది నిర్లక్ష్యం చెప్పాల్సిన అవసరమే లేదు.

### అవినీతిమయం



వెల్‌నెస్ సెంటర్లలో ఉద్యోగుల నియామకాలు, మందుల కొనుగోళ్ల తీరు మొత్తం అయోమయంగా కొనసాగుతుంది. గ్రేటర్ పరిధిలో ఉన్న సెంటర్లలో అధికారుల పర్యవేక్షణ కరవైంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేపట్టాలి. అవినీతి జరుతున్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

– వెంకటేశ్, సీపీఎం గ్రేటర్ సెంట్రల్ సిటీ కార్యదర్శి